క్లుప్తంగా

మాడుగుల ఎంపీడీవోగా అప్పారావు బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో అప్పారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యదర్శులు

మాడుగుల : మాడుగుల ఎంపీడీవోగా కొంకి అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా కరప మండలం ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో 2014 నుంచి 2019 సంవత్సరం వరకు మాడుగుల మండల పంచాయతీ విస్తరణాధికారిగా ఈయన పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన అప్పారావును కార్యాలయం సూపరింటెండెంట్ గోపాలరావు, ఇతర సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పలు గ్రామాల సర్పంచ్‌లు పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మోదకొండమ్మ ఆలయంలో పూజలు చేశారు.

బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శికి సన్మానం



పంచాయతీ కార్యదర్శి సౌజన్యను సన్మానిస్తున్న సర్పంచ్ దేముళ్లు

కె.కోటపాడు : మండలంలోని గుల్లేపల్లి పంచాయతీ కార్యదర్శిగా సౌజన్య ఎనలేని సేవలందించారని సర్పంచ్ బండారు దేముళ్లు తెలిపారు. బదిలీపై వెళ్తున్న ఆమెను స్థానిక సచివాలయంలో శుక్రవారం దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పెండింగ్ పనులు పూర్తి



సూచనలిస్తున్న ఎంఈవో వరహాలబాబు

నాతవరం: విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎంఈవోలు సత్యనారాయణ, వరహాలబాబు సూచించారు. మండల కేంద్రం నాతవరంలో శుక్రవారం సీఆర్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అంతా పనిచేయాలని చెప్పారు, ప్రధానంగా మండల వ్యాప్తంగా ఉపాధ్యాయులు యూడైస్ ప్లస్‌లో పెండింగ్ లేకుండా సమాచారాన్ని నమోదు చేయాలన్నారు.సెమిస్టర్ 2 పుస్తకాలు దసరా సెలవుల అనంతరం విద్యార్థులకు సకాలంలో పంపిణీ జరగాలని చెప్పారు. మధ్యాహ్న భోజనం పథకం పెండింగ్ బిల్లుల సమస్యలు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించాలని సూచించారు. విద్య పరంగా నూతనంగా అమలు చేసే కార్యక్రమాల నిర్వహణపై అశ్రద్ధ చేయరాదని తెలిపారు. సమావేశంలో సీఆర్పీలు పోలుపర్తి నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి, గోవింద, సత్యవేణి, ఎంఈవో కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్ నాయుడు, సాంబ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషనర్ ఆదేశాలు అమలు చేయాలి



సూచనలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రాజు

నాతవరం: ఎన్నికల కమిషనర్ ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేయాలని డిప్యూటీ తహసీల్దార్ టి.వి.ఎల్.రాజు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్‌వోలతో శుక్రవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదేశాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటరు నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మండలంలో గల 31 పంచాయతీల బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336
సాక్షి

విజయకారిణి..శక్తి స్వరూపిణి

గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం అమ్మవారు గాయత్రీ దేవి, బాలా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలు, మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.భవానీ భక్తులతో పాటు, మహిళలు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.



సీతయ్యపేటలో దుర్గామల్లేశ్వరి అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



బాలాత్రిపుర సుందరి అలంకరణలో దేవీతల్లి



కంచుగుమల్లో దుర్గమ్మకు పూజలు చేస్తున్న ఎంపీటీసీ వద్దాది సతీష్ దంపతులు



గాయత్రీ మాత అలంకరణలో చోడవరంలో దుర్గాదేవి అమ్మవారు



సీతయ్యపేటలో గాయత్రీదేవి అలంకరణలో దుర్గాదేవి



కేజే పురం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

బుచ్చెయ్యపేట: మండలంలో బుచ్చెయ్యపేట, వడ్డాది,రాజాం,లోపూడి,విజయరామరాజుపేట,తురకలపూడి, గున్నెంపూడి,పెదమదీన తదితర గ్రామాల్లో దుర్గాదేవి మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి పలు గ్రామాల్లో దుర్గాదేవి మండపాల్లో భజనలు నిర్వహించారు. సీతయ్యపేటలో అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. దుర్గామల్లేశ్వరి అమ్మవాకి క్షీరాభిషేకం చేశారు.

మాడుగుల: స్థానిక దేవీతల్లి ఆలయంలో శరన్న నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండోరోజు అమ్మవారు బాల త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవీతల్లిని పూలు, నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మాడుగుల రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కేజేపురం కళావేదికపై ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహం వద్ద, కేజే పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన జరిపారు. తొమ్మిది రోజుల పాటు అష్టలక్ష్మి పూజలు, అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు తెలిపారు. వంటర్లపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో గురుభవానీ దండి నర్సింగరావు ఆధ్వర్యంలో భవానీ భక్తులు కుంకమ పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. కేజే పురం శివాలయంలో పార్వతీదేవికి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కుంకమ పూజలు నిర్వహిస్తున్నారు. ఎం.కోటపాడు, వీరనారాయణం, గాదిరాయి, చింతలూరు, కింతలి, అవురువాడ తదితర గ్రామాల్లో అమ్మవారి మండపాలు ఏర్పాటు చేసి, భక్తిశ్రద్ధలతో పూజలు జరుపుతున్నారు.

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. భవానీమాలలు ధరించిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు జరుపుతున్నారు. కంచుగుమలలో భవానీ మాలధారులు శుక్రవారం ప్రత్యేకపూజలు చేశారు. అడ్డసరం ఎంపీటీసీ వద్దాది సతీష్ అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు.

చోడవరం: స్థానిక దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం గాయత్రీ మాతగా అమ్మవారిని అలంకరించారు. దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భవానీ భక్తుల శరణ గోషతో ఆలయం మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు శివ ప్రత్యేక పూజలు చేశారు.

ఉచితంగా ఇసుక అందజేయాలి

- చీడికాడలో భవన నిర్మాణ కార్మికుల ధర్నా



చీడికాడలో ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

చీడికాడ: కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను పూర్తి స్థాయిలో అందించి, తమకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చీడికాడలో భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రెడ్డి దేముడునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పార్టీలు అధికారం చేపట్టిన తరువాత తీవ్రమైన ఇసుక కొరత ఏర్పడడంతో కార్మికులు పనులు లేక, రోడ్డున పడ్డారని చెప్పారు. ఉచితంగా ఇసుక ఇవ్వకపోగా, ఇసుక లేకుండా చేశారన్నారు. ఇసుక కొరత కారణంగా పనులు నిలిచిపోయాయని, కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని ఆయన చెప్పారు. దుర్భర స్థితిలో భవన నిర్మాణ కార్మికులు జీవనం సాగిస్తుంటే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తిరుమల లడ్డూ చుట్టూ రాజకీయం చేయడం సరికాదన్నారు. ఇసుక కొరతతో నాలుగు నెలలుగా భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని చెప్పారు. గతంలో 33 టన్నుల గోదావరి ఇసుక రూ.28,000 ఉండేదని, ఇప్పుడు 20 టన్నుల రూ.30,000 ఇస్తున్నారని, ఆ సొమ్ము చెల్లిస్తున్నా ఇసుక దొరకడం లేదని చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కొత్తపెంట,చింతలపూడిల్లో గ్రామ సభలు



చింతలపూడిలో కార్యదర్శి, వీఆర్‌వోను సత్కరిస్తున్న గ్రామస్తులు



కొత్తపెంట కార్యదర్శి జిలానీని సత్కరిస్తున్న సర్పంచ్ వెంకటరావు

దేవరాపల్లి: మండలంలో కొత్తపెంట, చింతలపూడి గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు రొంగలి వెంకటరావు(నీలిమ), దొమ్మంగి బోడెమ్మ అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభల్లో పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనుల వివరాలు ప్రజలకు తెలియజేశారు. చింతలపూడి పంచాయతీలో పనిచేసి, బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శి ఎస్.కె. రహమాన్, వీఆర్‌వో కాసప్ప, కొత్తపెంట పంచాయతీ కార్యదర్శి జిలానీలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎంపీటీసీ సభ్యులు బండి గౌరమ్మ, ఉప సర్పంచ్ జి.గంగరాజు, తామరబ్బ సర్పంచ్ టోకూరి రామకృష్ణ, ఉప సర్పంచ్ గుమ్మదాపు దేవి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోవాడ చెరకు రైతు కుటుంబాలకు బీమా సొమ్ము పంపిణీ



బీమా సొమ్ము చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు, ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతు కుటుంబాలకు ఎట్టకేలకు బీమా సొమ్మును యాజమాన్యం శుక్రవారం అందజేసింది. ఫ్యాక్టరీ సమకూర్చాల్సిన రైతు సంక్షేమ నిధి బీమా సొమ్మును గత 16సీజన్ల నుంచి ఇప్పటి వరకూ రైతులకు ఫ్యాక్టరీ చెల్లించలేదు. ఒక్కో రైతు నుంచి ఏటా రూ. 400 వరకూ రైతు సంక్షేమ నిధికి ఫ్యాక్టరీ వసూలు చేస్తుంది. ఈ సొమ్మును రైతు చనిపోతే అతని కుటుంబ సభ్యులకు రూ.30వేల చొప్పున బీమా సాయంగా అందిస్తారు. అయితే గత 16 సీజన్ల నుంచి ఈ సొమ్మును ఇవ్వకపోవడంతో బాధిత రైతు కుటుంబాల సభ్యులు ఇటీవల జరిగిన మహాజనసభలో ప్రశ్నించారు. దీనిపై ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించింది. మొత్తం 341మందికి సొమ్ము చెల్లించాల్సి ఉండగా మొదటి విడతగా 141 మందికి రూ.40 లక్షలు చెల్లించింది. బాధిత రైతు కుటుంబ సభ్యులకు ఈ చెక్కులను ఫ్యాక్టరీ ఆవరణంలో మేనేజింగ్ డైరెక్టర్ వి.వి. సన్యాసినాయుడు అధ్యక్షతన ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫ్యాక్టరీ సుమారు రూ. 130 కోట్ల మేర అప్పుల్లో ఉందని, ఆ అప్పులను తీర్చేందుకు అవసరమైన మార్గాలను అన్వేషిస్తున్నామని చెప్పారు.

గ్రూప్ డిస్కషన్‌లో డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



కలెక్టర్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థులు

చోడవరం రూరల్: గ్రూప్ డిస్కషన్ పోటీలో అనకాపల్లి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో కృపాచంద్,గాయత్రీ, ధనలక్ష్మిల బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతలకు కలెక్టర్ జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందచేశారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను, వారికి మార్గదర్శనం చేసిన పి.డి. మూర్తి, రామలక్ష్మిలను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎ.కృష్ణారావు, మల్లిబాబు, డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, రత్నభారతి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నేడు

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో పలు డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు శనివారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపా రు. 2024–25 విద్యా సంవత్సరంలో కళాశాలలోని బీఏ ఎకనామిక్స్ ఆనర్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ ఆనర్స్, బీఎస్సీ కెమెస్ట్రీ, జువాలజీ ఆనర్స్‌లలో ఖాళీల సీట్ల భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రవేశాలను కోరు విద్యార్థులు వారి విద్యార్హతలు, నివాస,ఆదాయ,కులధ్రువీకరణ అసలు, నకిలీ పత్రాలతో కళాశాలలో స్వయంగా సంప్రదించాలని తెలిపారు.ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులు తక్షణం ఫీజును చెల్లించాని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

జీవకారుణ్య సంఘానికి పూర్వ వైభవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన సలహాదారు సత్తిబాబు

రోలుగుంట: జీవకారుణ్య సంఘానికి పూర్వవైభవం తీసుకువస్తామని జీవకారుణ్య సంఘం సలహాదారుడు సత్తిబాబు తెలిపారు. మండలం కేంద్రంలో శిథిలావస్థకు చేరిన జీవకారుణ్య సంఘం భవనాన్ని సుమారు రూ.12 లక్షల వ్యయంతో పునర్నిర్మించారు. నిర్మాణం పూర్తయిన తరువాత తొలిసారిగా శుక్రవారం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఈ భవన నిర్మాణానికి రూ.5 లక్షల ప్రభుత్వ నిధులు, జెడ్పీటీసీ పోతర లక్ష్మి రమణమ్మ తన కోటా నిధుల నుంచి రూ.2.5 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. ఆ నిధులతో 2023 లో నిర్మాణ పనులు చేపట్టమన్నారు. శ్రీ వరసిద్ధి వినాయక ఆలయం భక్తుల సహాయ నిధి, సంఘ సంభ్యుల సొంత సొమ్ము కలిసి సుమారు రూ.12 లక్షల వ్యయంతో ఈ భవన నిర్మాణం పూర్తియిందని చెప్పారు. అనంతరం గత నెల మరణించిన సంఘం ప్రధాన సలహాదారుడు మద్దు గైరమ్మ సత్యం మృతికి సంతాపం వ్యక్తం చేశారు. సంఘం సభ్యులు కొట్టే పైడియ్య నాయుడు, ఫీల్డ్‌మెన్ సత్తిబాబు, మద్దు రాజగోపి, కొట్టే సంజీవరావు, మాకిరెడ్డి శ్రీను, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు చేస్తున్న చంద్రబాబు, పవన్

- మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి ప్రజలను తప్పుదోవ పట్టించే కార్యక్రమాలకే చంద్రబాబు, పవనకల్యాణ్ ప్రాధాన్యం ఇస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ధ్వజమెత్తారు.స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ పింఛన్ తప్పా మరే హామీ నెరవేర్చలేదన్నారు. రైతులకు ఇస్తానన్న సాయం, తల్లికి వందనంతోపాటు ఏ హామీని నెరవేర్చలేదని తెలిపారు. ప్రజలు ఎదురుతిరుగుతారనే భయంతో ఎంతో పవిత్రమైన తిరుపతి లడ్డూను కల్తీ చేశారంటూ లేనిపోయి దుష్ప్రచారాలకు తెరతీశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా చంద్రబాబు, పవన్, బీజేపీ నాయకులకు బుద్ధిరాలేదని ధర్మశ్రీ ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజల దృష్టిని మళ్లించడానికి టీడీపీ కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారు తప్ప ఇచ్చిన హామీలు నెరవేర్చాలనే ఆలోచన చేయడంలేదని చెప్పారు. అసలు తిరుపతి లడ్డూ ఎలా తయారు చేస్తారో తెలుసుకోకుండా చంద్రబాబు చెప్పిన మాటలు విని ఆరోపణలు చేసి, చివరకు పవన్‌కల్యాణ్ కామెడీ ఆర్టిస్టు అయిపోయారని ధర్మశ్రీ ఎద్దేవా చేశారు. ఉచితమని చెప్పి జిల్లాలో టన్ను ఇసుకను రూ.2వేలకు మించి అక్రమంగా అమ్ముతున్నారన్నారు. పెరిగిన ఇసుక ధరలను చూసి ఇళ్ల నిర్మాణదారులు బెంబేలెత్తిపోతున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఉచిత ఇసుకపాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఎన్ రోడ్డును, రావికమతం, తోటకూరపాలెం రోడ్డు పనులు అధికారంలోకి వచ్చిన వెంటనే మొదలు పెడతామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, ఎంపీలు ఇంకా ఆ పనులు చేయించలేదన్నారు. ఈ రెండు రోడ్లకు తమ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరుచేయడం, టెండర్లు పిలవడం జరిగిందని చెప్పారు. టీడీపీ నాయకుడే బీఎన్‌రోడ్డును రూ.112కోట్లకు టెండరు పాడి పనులు చేయకుండా ఎగ్గొట్టారని, ఆయనతో పనిచేయించే బాధ్యత స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ రెండు రోడ్ల నిర్మాణంచేపట్టాలన్నారు. తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రూ. 89కోట్లు ఇచ్చి గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకున్నామని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా ఫ్యాక్టరీకి ఆర్థికసాయం చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కనీసం టన్నుకి రూ. 3,600 చెల్లించాలని, స్థానిక ఎమ్మెల్యే ఈ దసరా నాటికి ఆ ప్రకటన చేసి చెరకు రైతులకు తీపి కబురు చెప్పాలని ధర్మశ్రీ డిమాండ్ చేశారు.

వారపు సంతకు దసరా శోభ

- తిమిరాంకు భారీగా వచ్చిన పొట్టేళ్లు, మేకపోతులు
- భారీ డిమాండ్‌తో అమాంతంగా పెరిగిన ధరలు



ప్రత్యేక ఆకర్షణగా కొమ్ములు తిరిగిన పొట్టేళ్లు



క్రయ, విక్రయదారులతో కిటకిటలాడిన తిమిరాం వారపు సంత

దేవరాపల్లి: మండలంలోని తిమిరాం వారపు సంత దసరా శోభను సంతరించుకుంది. పొట్టేళ్లు, మేకపోతులు, నాటుకోళ్లతో కళకళలాడింది. దసరా రోజున మోటార్లు, వాహనాలు, యంత్ర పరికరాలకు పొట్టేళ్లు, నాటు కోళ్లను మొక్కబడి చెల్లించుకోవడం ఆనవాయితీ. దీనిలో భాగంగా శుక్రవారం జరిగిన సంతకు జిల్లా నలుమూలల నుంచి గొర్రె పోతులు, మేక పోతులతో పాటు నాటు కోళ్లను విక్రయాలకు అధిక సంఖ్యలో తీసుకువచ్చారు. విశాఖపట్నం, విజయనగరం, పాడేరు తదితర ప్రాంతాల నుంచి కూడా పొట్టేళ్లు, మేక పోతులను తీసుకొచ్చారు. అదే సంఖ్యలో జిల్లా వ్యాప్తంగా కొనుగోలుదారులు సైతం రావడతో వీటి ధరలకు రెక్కలొచ్చాయి. ఈ సంతలో తక్కువ ధరకు ఆరోగ్యకరమైన పొట్టేళ్లు, మేక పోతులు, నాటుకోళ్లు లభిస్తాయన్న అభిప్రాయంతో సుదూర ప్రాంతాల నుంచి సైతం కొనుగోలుదారులు తరలివచ్చారు. అయితే 10 కేజీల బరువు గల పొట్టేళ్లు రూ.25 వేలు నుంచి రూ. 35 వేలు వరకు ధర పలికాయి. సాధారణ రోజుల్లో రూ.1000 నుంచి రూ.1500 ధర పలికే నాటుకోళ్లు.. రూ.2 వేలు నుంచి రూ.4 వేల వరకు కొనుగోళ్లు జరిగాయి. ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ తప్పని పరిస్థితుల్లో మండుటెండను సైతం లెక్క చేయకుండా పోటీ పడి మరీ కొనుగోళ్లు చేపట్టారు. వెరసి క్రయ, విక్రయదారులతో తిమిరాం వారపు సంతలో దసరా సందడి కనిపించింది. సుమారు రూ.50 లక్షల వరకు వ్యాపారం జరిగినట్టు అంచనా.

ఆయకట్టు శివారు భూములకూ నీరందిస్తాం

- తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ



తాండవ ప్రాజెక్టు నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న డీఈ అనురాధ, జేఈ శ్యామ్‌కుమార్

నాతవరం: తాండవ రిజర్వాయర్ నుంచి ఆయకట్టు శివారు భూములకు కూడా నీరు అందించేందుకు దృష్టి సారించినట్టు తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. తాండవ రిజర్వాయర్‌లో నీటి మట్టాన్ని శుక్రవారం ఆమె పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తాండవ రిజర్వాయర్‌లో నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 378.4 అడుగులు ఉందన్నారు. ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో 335 క్యూసెక్కులు ప్రాజెక్టులోకి వస్తోందని చెప్పారు. ఖరీఫ్ పంటకు కాల్వల ద్వారా రోజు 550 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్టు చెప్పారు. ఈఏడాది వాతావరణం బాగుందని, వర్షాలు అధికంగా కురవడంతో ప్రాజెక్టులో నీటి మట్టం బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఈ శ్యామ్‌కుమార్, ప్రాజెక్టు సిబ్బంది ఉన్నారు.

మాడుగుల ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐగా ప్రసాద్



ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ ప్రసాదు

మాడుగుల రూరల్: మాడుగుల ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐగా సి.హెచ్.వి.ఎస్. ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయనగరం ఎక్సైజ్ – 2 స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడి వచ్చారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మాడుగుల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మాడుగుల, చీడికాడ, రావికమతం మండలాలు ఉన్నాయని చెప్పారు. నూతన ఎక్సైజ్ విధానం మేరకు మద్యం షాపుల కోసం ఈనెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి, 11 వ తేదీన లాటరీ తీయనున్నట్టు చెప్పారు. 12 నుంచి కొత్త మద్యం షాపుల ద్వారా విక్రయాలు ప్రారంభమవుతాయన్నారు. మాడుగుల మండలానికి ఐదు షాపులు, రావికమతం మండలానికి ఐదు షాపులు, చీడికాడ మండలానికి మూడు షాపులు కేటాయించినట్టు చెప్పారు. ఒక్కో మద్యం షాపునకు రూ.65 లక్షల చొప్పున లైసెన్సు ఫీజు చెల్లించాలని, చీడికాడకు రూ.55 లక్షల చెల్లించాలని తెలిపారు. నూతన ఎస్ఐగా వి.జె.శంకర్రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com